ntnews.com
IV నమస్తే తెలంగాణ
బుధవారం 25 అక్టోబర్ 2023

ప్రజల మాట ప్రగతి బాట

# నకిరేకల్ నియోజకవర్గం

## సీఎం కేసీఆర్ సభకు చకచకా ఏర్పాట్లు

- రేపు మునుగోడుకు రానున్న బీఆర్ఎస్ అధినేత
- పెద్ద ఎత్తున్న తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న జనం
- సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కూసుకుంట్ల


మునుగోడులో సిద్ధమవుతున్న సభావేదిక

మునుగోడు, అక్టోబర్ 24 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ నెల 26న మునుగోడులో హాజరు కానున్న ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రానికి ఏర్పాట్లును పూర్తి చేయనున్నారు. విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడ్రోజులుగా ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి స్వయంగా సభ ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు.

సభాస్థలాన్ని సిద్ధం చేయడంతో పాటు వేదిక నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. సభకు విస్తృత ప్రచారం కల్పిస్తూ మండలాల వారీగా ఇన్‌చార్జిలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. సభకు హాజరయ్యే జనానికి కూడా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సభకు వచ్చే వాహనాలను సైతం ఎక్కడికక్కడే పార్కింగ్ చేసే విధంగా మునుగోడుకు మూడు వైపులా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు ఎటు వైపు వచ్చే వాహనాలు ఆ వైపే నిలిపి అక్కడి నుంచి ప్రజలకు సభాస్థలికి చేరుకునేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు

ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఉదయం నుంచే మునుగోడులో ఉండి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి సభ ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశ్వీరాద సభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వదించి ఉప ఎన్నికలో టికెట్ ఇచ్చి పంపుతే మీరు గెలిపించారు. దాంతో నాలుగేండ్లలో నిలిచిపోయిన అభివృద్ధిని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సహకారంతో పది నెలలో నియోజకవర్గాన్ని సుమారు రూ.600 కోట్ల నిధులతో అభివృద్ధి చేసి చూపించాను. ఇప్పుడు జరిగే సాధారణ ఎన్నికల్లో మునుగోడు బీఆర్ఎస్ అభ్యర్థిగా మళ్లీ ఆశీర్వదించి టికెట్ ఇచ్చారు. మరలా ప్రజలు ఆశీర్వదిస్తే మునుగోడులో మిగిలిపోయిన పనులు కూడా పూర్తి చేస్తానన్నారు. ప్రజాఆశ్వీరాద సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని అందుకు అనుగుణంగా సభా ఏర్పాట్లుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుషోత్తంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, బండారు వెంకన్న, ఐతగోని విజయ్‌కుమార్, పెరమాళ్ల ప్రణయ్ కుమార్, ప్రసాద్, కిరణ్, సభా ఏర్పాట్లు బృందాలు, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

## నేడు రామన్నపేట మండలంలో ఎమ్మెల్యే చిరుమర్తి ప్రచారం

రామన్నపేట, అక్టోబర్ 24:మండలంలో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి పోశబోయిన మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నిధానపల్లి, ఇంద్రపాలనగరం గ్రామాల్లో ఉదయం 9 గంటలకు ప్రచారం నిర్వహించనున్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను మరోసారి గెలిపించాలి


నకిరేకల్ 16 వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఆ వార్డు కౌన్సిలర్ సైదులు

నకిరేకల్, అక్టోబర్ 24 : త్వరలో జరుగనున్న ఎన్నికల్లో చిరుమర్తి లింగయ్యను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని 16వ వార్డు కౌన్సిలర్ గర్షకోటి సైదులు కోరారు. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని కోరుతూ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట వార్డు అధ్యక్షుడు చెరుకు వీరయ్య, మహిళా అధ్యక్షురాలు కొండూరి నాగమణి, పెండెం రాజేశ్వరి, కప్పల రవి, నగేశ్, యాసారపు శివ, జంజిరాల నవీన్, చిక్కుల సురేశ్ పాల్గొన్నారు.


ఉర్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు

## 2 నుంచి సయ్యద్ లతీఫ్ షావలీ ఖాద్రీ ఉర్సు

రామగిరి, అక్టోబర్ 24: మత సమరస్యానికి ప్రతీకగా నల్లగొండ గడియారం సెంటర్‌లో సయ్యద్ లతీఫ్ షావలీ దర్గా ఉర్సును నవంబర్ 2 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉత్స వాలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం దర్గా మెట్ల వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ముతవల్లీ, ముస్లిం పెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి రోజు అసర్ నమాజ్ తర్వాత గడియారం సెంటర్‌లోని మదీనా మసీద్ నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. 3న ఖురాన్ పఠనం , దీపాలంకరణ, సాయంత్రం జల్సా అజ్మతే ఔలియా ఉంటుందని పేర్కొన్నారు. 4న రాత్రి 9గం. ఖవ్వాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముతవల్లులు సయ్యద్ రషీద్ ఖాద్రీ సాహెబ్, సయ్యత్ సమీల్లా ఖాద్రీ సాహెబ్, సయ్యద్ సల్మాన్ ఖాద్రీ, ఉర్సు కమిటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ జాఫర్, గౌస్ జియాఉద్దీన్, సయ్యద్ ఏజాజ్‌హుస్సేన్, ఎండీ ఎజాజ్, హఫీజ్, షేర్‌ఖాన్, సయ్యద్ గౌడ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

## సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు

కోదాడ రూరల్, అక్టోబర్ 24: ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధి నల్లబండగూడెం శివారులోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే వస్తువులను రవాణా చేసిన వాహనలు, నగదును సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగిస్తున్నారు. ఈ తనిఖీల్లో పలు డిపార్టుమెంట్లకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.


సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

## రూ. 2 కోట్లతో మోడ్రన్ ధోబీఘాట్

- నకిరేకల్‌లో ఆధునాతన యంత్రాలతో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రజకులు


నకిరేకల్ పట్టణంలోని ఇసాయికుంట కట్టపై నిర్మిస్తున్న మోడ్రన్ ధోబీఘాట్

నకిరేకల్, అక్టోబర్ 24: రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల పూర్వ వైభవం తీసుకురావడానికి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న శాస్త్ర,సాంకేతిక రంగాలను ఉపయోగించి రజకులకు మోడ్రన్ ధోబీఘాట్‌లను నిర్మిస్తున్నది. ఒకప్పుడు రజకులు దుస్తులు పట్టుకుని చెరువులు, కుంటల వైపు వెళ్లేవారు. ప్రభుత్వం వారి బాధలు చెక్ పెడుతూ ప్రతి మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా రూ.2 కోట్లు నిధులు కేటాయించి మోడ్రన్ ధోబీఘాట్ నిర్మిస్తున్నది. మరో రెండు నెలల్లో ధోబీఘాట్ అందుబాటులోకి రానుంది. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో 350 రజక కుటుంబాలున్నాయి. 150 నుంచి 200 కుటుంబాలు రజక వృత్తిమీద ఆధారపడి జీవిస్తున్నాయి. రోడ్డు వెంట 35 నుంచి 40 లాండ్రీ దుకాణాలు రజకులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రతి లాండ్రీ దుకాణం 250 యూనిట్లు ఉచిత కరెంటు అందిస్తున్నది. పట్టణంలోని ఇసాయికుంట కట్టపై రూ.2 కోట్లతో మోడ్రన్ ధోబీ ఘాట్ నిర్మిస్తున్నారు. 700 గజాల్లో పెద్ద షెడ్డు నిర్మిస్తారు. అనంతరం యంత్రాలను అమరుస్తారు. ఆధునాతన విధానంలో ఉతికే యంత్రాలు, ఉతికిన వాటిని ఆరబెట్టే యంత్రాలు, తరువాత ఇస్త్రీ చేసి పెట్టే యంత్రాలను ప్రభుత్వమే సమకూర్చనుంది. గంటకు ఒక సైకిల్ చొప్పున 240 దుస్తులు ఉతికి ఇస్త్రీ చేసే యంత్రాలను రూపొందించారు. ఒక షిఫ్టులో ఎనిమిది సైకిళ్లు ఉంటాయి. 1,920 దుస్తులు ఉతుకుతాయి. రెండు షిఫ్టుల్లో అయితే 3,840 దుస్తులను ఉతికి ఇస్త్రీ చేసే యంత్రాలను రూపొందించారు. గతంలో సర్ఫ్, సబ్బు, సోడా వాడడంతో దుస్తులు పాడవుతుండేవి. రజకులు కూడా అనారోగ్యాల పాలయ్యేవారు. ప్రస్తుత ఆధునిక యంత్రాల ద్వారా ఎలాంటి ప్రమాదాలు రాబోవని అధికారులు చెబుతున్నారు.

### రెండు నెలల్లో మోడ్రన్ ధోబీఘాట్



నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో మోడ్రన్ ధోబీఘాట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2 కోట్లు కేటాయించింది. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో మోడ్రన్ అందుబాటులోకి రానుంది. పూర్తిస్థాయిలో మిషనరీ వస్తుంది. మున్సిపాలిటీ ప్రజలకు ధోబీఘాట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. రజక వృత్తిదారులకు మరింత ఉపాధి లభించే అవకాశం ఉంది.

– బాలాజీ, మున్సిపల్ కమిషనర్

### ఎమ్మెల్యే చిరుమర్తికి రుణపడి ఉంటాం



నకిరేకల్ పట్టణంలో రూ.2 కోట్లతో ప్రభుత్వం ఆధునిక దోబీఘాట్ నిర్మిస్తున్నది. మాకు చాలా సంతోషంగా ఉంది. లాండ్రీ షాపులకు 250 యూనిట్లు కరంటు ఇస్తున్నది. రజక వృత్తిని తెలంగాణ ప్రభుత్వం కాపాడుతుంది. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు రజకులమంతా రుణపడి ఉంటాం. మరో రూ.25 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. రజకులందరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుంటాం.

–పగిళ్ల వెంకన్న, రజక సంఘం పట్టణాధ్యక్షుడు, నకిరేకల్